

# అమెరి'కలకలం' కథలు

## - వంగూరి చిట్టెన్ రాజు



# 19

# 50 వ నెల నెలా తెలుగు వెన్నెల

# జొన్నవిత్తుల -సిరివెన్నెల

నాకు జీవితంలో రెండు సిద్ధాంతాలు ఉన్నాయి. ఒకటేమో ..నన్ను ఎవరైనా పొగిడితే వాళ్ళు చాలా గొప్ప వాళ్ళు, నిజాయితీ పరులు. అదే నేను ఎవరినైనా పొగిడితే వాళ్ళు నాకు పావలాయో , అర్థణాయో విరాళం ఇచ్చిన వాళ్ళు అయ్యుండాలి. ఇక నన్ను ఎవరైనా తిడితే అది తక్కువ స్థాయి వ్యంగ్యం. అదే నేను ఎవరినైనా తిడుతూ వ్రాస్తే అది అద్భుతమైన హాస్యం రసం.

"నీ మొహం. అందుకే నీకు ఇద్దరు ఆడపిల్లలు" అంది మా క్వీన్ విక్టోరియా. నాకు లంగరు అందక వెర్రి మొహం పెట్టాను. అది చూడగానే "అదేలేవోయ్ వె.మొ. గారూ... నీకున్న రెండు సిద్ధాంతాలు శుద్ద అబద్ధాలు. అందుకే నీకు ఇద్దరు ఆడపిల్లలు ....ఇంకా నయం నువ్వు ఇలా అబద్ద సిద్ధాంతాలు రాసుకుంటే పోతే .... కొంప మునిగి పోయి, అమెరికాలో అడ జనాభా పెరిగిపోవును. " అని చిరు నవ్వుతో నా అర్ధరాత్రి 'టెంకి జెల్ల " బహుమతి ప్రసాదించి ఆవిడ నిష్క్రమించింది.

ఇంతకీ జరిగినది ఏమిటంటే ఈ నెల....అనగా జూన్, 2014 మా హ్యూస్టన్ లో సాహిత్యం వెన్నెల అలా కురుస్తూనే ఉంది. అందులోనూ యాభైవ సారి తెలుగు వెన్నెల అనగానే..అనగా....మా ఊళ్లో అప్పుడప్పుడు "నెల తప్పినా" యాభై నెలలుగా "నెల నెలా తెలుగు వెన్నెల" పేరిట సాహిత్య కార్యక్రమాలు జరిపిన సందర్భంగా "స్వర్ణోత్సవాలు" జరుపుకున్నాం. మా అదృష్టం బావుండి తెలుగు భాషకీ, సాహిత్యానికీ పెద్ద పీట మాట మాట దేవుడెరుగు, కనీసం చిరిగిపోయిన చింకిరి చాప కూడా వేయని కేసీఆర్ గారూ, చంద్రబాబు గారూ, మా ఊళ్లో ఉన్న వారి అభిమానులు మా ఆహ్వానాన్ని మన్నించి ఈ స్వర్ణోత్సవాలకి రాలేదు. అందుకు ప్రధాన కారణం మేము వారికీ ఏ విధమైన ప్రత్యేక ఆహ్వానం పంపించకపోవడమే అనేది అబద్ధం కాదు. అందువలన నాకు మూడో ఆడ పిల్ల కలిగే అవకాశం లేనే లేదు. దానికి ఇతర కారణాలు కూడా ఉన్నా అవి అందరూ ఊహించగలిగిన అప్రస్తుత ప్రసంగమే కదా!

అసలు ఇందులో నా సొంత డబ్బాలు మూడు ఉన్నాయి. ఆ డబ్బాలు కొట్టుకోవడమే అసలు, సిసలు నిజం అని "సిగ్గు" పడకుండానే చెప్పగలను కానీ , నిజానికి నాకూ, క్వీన్ విక్టోరియాకీ చాలా సిగ్గుగానే ఉంది. ఒక డబ్బా పేరు "సిరివెన్నెల & పద్మావతి డబ్బా" , అయితే

మరో డబ్బా పేరు "జొన్నవిత్తుల & శేషకుమారి". దీనికి కారణం ఈ దంపతులు ..అనగా ..సిరివెన్నెల సీతారామశాస్త్రి & పద్మావతి , మరియు జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు & శేషకుమారి దంపతులు హ్యూస్టన్ లో మా "కుటీరానికి" వచ్చి మదర్పిత ....మామిడికాయ పప్పు, వంకాయ కూర, ఆవ పెట్టిన అరటికాట ముద్ద కూర, కేబేజీ కూర , ముక్కాల పులుసు, క్వీన్ విక్టోరియా పేటెంటు సాంబార్, పొట్లకాయ పెరుగు పచ్చడి, కొబ్బరి పచ్చడి, కాకినాడలో మా ఇంట్లో కాచిన రాచ ఉసిరి కాయలతో మా పెద్ద వదిన గారు చేసిన ఉసిరి కాయ పచ్చడి మరియు గోంగూర, బజారులో కొనుక్కున్న మజ్జిగ మిరపకాయలు, రసమలై , జిలేబీ, రసగుల్లా వగైరాలతో మా ఇల్లు పావనం అయింది. ఇక మూడో "డబ్బా" నాకు ఎంతో ఆత్మీయుడు సుప్రసిద్ధ రచయిత , యెమెన్ దేశం ఉంటూ తెల్గు పద్యానికి పెద్దపీట వేస్తున్న బాలాంత్రపు వెంకట రమణ & శారద మా "50 వ నెల నెలా తెలుగు వెన్నెల" కార్యక్రమలు విజయవంతం కావడంలో ప్రధాన పాత్ర వహించడమే కాకుండా, మా "కుటీరానికి" వచ్చి మమ్మల్ని మహాదానంద పరిచారు. ఆ దంపతులు నాటా వారి రెండవ మహా సభలకి ప్రత్యక ఆహ్వానితులు.

"ఆ వీడు ఏదో గాస్ కొడుతున్నాడు" అని ఎవరైనా అనుకుంటారేమో అని ఇందుతో కొన్ని ఫొటోలు జత పరుస్తున్నాను. అవి అబద్ధం ఫోటోలు అని మీరు అనుకుంటే ....మీకే ఆడపిలల్లలు పుడతారు ..శుభం....అంతకంటే అదృష్టం మరింకేమిటీ?







**COMMENTS**